ప్రాంగణ ఎంపికల్లో 28 మందికి ఉద్యోగాలు

ఉద్యోగాలకు ఎంపికైన వారితో యాజమాన్యం

ప్రజాశక్తి-పీలేరు: శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్‌మేళాలో 28 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్లు లోకేష్, సంజీవ తెలిపారు. తిరుపతి శ్రీసిటీకి చెందిన డైకిన్ ఎసి ప్రయివేట్ లిమిటెడ్ శనివారం స్థానిక శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు మాట్లాడుతూ తమ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో 55 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరికి వివిధ దశలలో జరిగిన ఇంటర్వ్యూలలో 28 మంది విద్యార్థులు ఎంపి కైనట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హెచ్‌ఆర్ మేనేజర్ కుసుమ నియామక ఉత్తర్వులు అందజేశారని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.రెండు లక్షల వార్షిక వేతనం అందుతుందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో కళాశాల విద్యార్థులు ముందుకు వెళుతూ ఉపాధిలో స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొని ఉద్యోగాలకు ఎన్నికైన అభ్యర్థులను అభినందించారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం ఆరు నుండి 8 గంటల వరకు వేదపండితులు, అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. బాజాభజంత్రీలు నడుమ వేదపండితుల మంత్రోచ్చరణ్ణలతో అంకురార్పణం చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు హారతి ఇచ్చారు. కేరళ వాయిద్యకారులు ప్రదర్శన పలువురిని ఆకట్టుకొంది. బ్రహోత్సవాలలో ప్రతి రోజు ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, సెల్వం, శివప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

రేపు ధ్వజారోహణం

ఈ నెల 6న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి 11.15 గంటలకు వృషభ లగ్నంలో ధ్వజారోహణం ఉంటుంది. ఆ తర్వాత పోతన జయంతి, కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శేష వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనమిస్తారు.

11న శ్రీసీతారాముల కల్యాణం

ఏప్రిల్ 11వ తేదీన రాత్రి 6.30 నుంచి 8.30 గంటల వరకు సీతా రాముల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. అనంతరం గజ వాహనసేవ నిర్వహిస్తారు. 12న రథోత్సవం నిర్వహిస్తారు. 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 15న సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

నేడు ధ్వజారోహణం
11న శ్రీసీతారాముల కల్యాణం
ఏర్పాట్లను పరిశీలించిన టిటిడి జెఇఒ

కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు : జెఇఒ

ఒంటిమిట్ట ఏకశిలానగరంలో 11న జరుగనున్న శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేశామని టిటిడి జెఇఒ వి.వీర బ్రహ్మం అన్నారు. కల్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యపు తలంబ్రాలు, అన్నప్రసాదాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఒంటిమిట్టలోని టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో శనివారం సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అధికారులు పటిష్ట ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 120 గ్యాలరీలలో ఉండే భక్తులతో పాటు, కల్యాణం వీక్షించేందుకు వచ్చిన భక్తులందరూ శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం 16 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీ సీతారాముల కల్యాణోత్సవం తిలకించేలా 15 ఎల్ఇడీ స్క్రీన్‌లు, ఆలయం, కల్యాణ వేదిక, తదితర ప్రాంతాల్లో విద్యుత్ కాంతులతో 38 దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు సులువుగా గుర్తించేదెలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో 100 సిసి కెమెరాలు, 3 డ్రోన్‌లు, 3 కంట్రోల్ రూమ్‌లు, దాదాపు 2400 మంది భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు దాదాపు 3 లక్షల తాగునీరు బాటిల్స్, 250 మంది పారామెడికల్ సిబ్బంది, 35 మంది వైద్య నిపుణులు, 13 మెడికల్ టీంలు, 8 అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ, పోలీసులు, టిటిడి అధికారులతో కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఏర్పాట్లను జెఇఒ పరిశీలించారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ జాన్ ఎర్విన్, టిటిడి సిఇ టివి.సత్యనారాయణ, ఎస్ఇ ఎలక్ట్రికల్ వేంకటేశ్వర్లు, అన్నప్రసాదం ప్రత్యేక అధికారి కెఎల్ఎన్ శాస్త్రి, రవాణా శాఖ జిఎం శేషారెడ్డి, డిప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, సెల్వం, శివప్రసాద్, ఎస్టేట్ అధికారి గుణ భూషణ్‌రెడ్డి, డిపిపి కార్యదర్శి శ్రీరాం రఘునాథ్ పాల్గొన్నారు.

కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెఇఒ వీరబ్రహ్మం

వైద్యుల నిర్లక్ష్యం

నరకయాతన అనుభవించిన గర్భిణి
సుఖ ప్రసవం చేసిన 108 సిబ్బంది
బయటపడిన వైద్యుల డొల్లతనం

గర్భిణికి 108లోనే సుఖ ప్రసవం చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సేవకులుగా విధుల్లో చేరి, ప్రజల సొమ్ముతో నెలకు లక్షలు, వేలల్లో జీతాలు తీసుకుంటున్న వైద్యులు, వైద్య సిబ్బంది తమ విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ చిన్నపాటి మెడికల్ కేసులను కూడా రెఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటుండంతో సామాన్యలు తీవ్ర ఇబ్బందులు ఎదొర్కొంటున్నారు. అందుకు నిదర్శనమే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రి వైద్య బృందం నిర్లక్యం వల్ల ఓ నిండు గర్భిణి కొన్ని గంటల పాటు నరకయాతన అనుభవించింది. ఆఖరకు 108 సిబ్బందే సుఖ ప్రసవం చేసి సమస్యను పరిష్కరించారు. గుర్రంకొండ మండలం మర్రిపాడుకు చెందిన పి.ఖాజా హుస్సేన్ భార్య నగీన్ తాజ్ ప్రసవ నొప్పులు రావడంతో శుక్రవారం రాత్రి వాల్మీకిపురం ప్రభుత్వ అస్పత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి కాన్పు కష్టంగా ఉందని మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి పంపించారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని వైద్యులు పరీక్షించి గర్భిణికి రక్తం తక్కువగా ఉందని ఇక్కడ ప్రసవం చేస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని వెంట వచ్చిన కుటుంబ సభ్యులను ఆందోళనకు గురి చేసి తిరుపతికి వెళ్లాలని సూచించారు. తాము పేదవారమని, అంత దూరం వెళ్లలేమని, ఇక్కడే ప్రసవం చేయాలని కాళ్లా, వేళ్లా పడినా కనికరించలేదు. తామే 108 మాట్లాడుతామని మీరు వెళ్లాల్సిందేనని కరాఖండిగ చెప్పారు. అర్ధరాత్రి అవుతుండడం, నగీన్ తాజ్‌కు ప్రసవం ఆలస్యం అవుతుండడం, వైద్యులేమో అక్కడికెళ్లండి, ఇక్కడికెళ్లండని నిర్లక్ష్యం చేయడంతో ఆ నిండు గర్భిణి నరకయాతన అనుభవించింది. ఇక చేసేది లేక కుటుంబ సభ్యులు 108లో తిరుపతికి బయల్దేరారు. మార్గమధ్యంలోనే గర్భిణికి పురిటి నొప్పులు ఎక్కువై భరించలేకుండా గట్టిగా కేకలు వేసింది. 108 సిబ్బంది సురేంద్రబాబు, యోగేష్ నాయక్ గర్భిణి కుటుంబీకుల అభ్యర్థన మేరకు మార్గమధ్యంలోని బాకరాపేట ఘాట్లో అర్ధరాత్రి నగిన్ తాజ్‌కి సాధారణ ప్రసవమయ్యేలా కృషి చేశారు. ఆమె సాధారణంగానే ప్రసవించింది. తల్లి బిడ్డను సురక్షితంగా తీసుకెళ్లి తిరుపతి ప్రసూతి అస్పత్రిలో చేర్పించారు. ఈ ఉదంతంతో వైద్యుల డొల్లతనం బయట పడింది. డాక్టర్ పట్టా పొందిన వైద్యులు, నర్సింగ్ చేసిన వైద్య సిబ్బంది చేయలేని పని 108 ఈఎంటి (ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నీషియన్), పైలట్ లు కృషి చేసి సుఖ ప్రసవం చేశారని గర్భిణీ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నెలకు లక్షల్లో జీతాలు తీసుకునే డాక్టర్లు ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. వారికంటే 108లో అందించే సేవలే అభినందనీయమని ప్రశంసించారు. ప్రజల ఆరోగ్యంపై చిన్నచూపు, నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి చిన్న గాయంతో వెళ్లినా బయటకు వెళ్లాలని రెఫర్ లు చేస్తున్నారని పలు ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పట్టించుకోని నాయకులు, అధికారులు ఉన్నంత కాలం ప్రజలు ఇలాంటి భరించలేని బాధలు అనుభవించాల్సిందేనని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఏకగ్రీవంగా ఎపిజెఎసి డివిజన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ఎన్‌జిఒ హోంలో శనివారం జరిగిన ఎపి జెఎసి మదనపల్లె డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు నర్సింహారెడ్డి తెలిపారు. మదనపల్లి డివిజన్ ఎపి జెఎసి చైర్మన్‌గా నరసింహారెడ్డి, సెక్రటరీ జనరల్‌గా మధుసూదన, కో-శాధికారిగా రెడ్డిశేఖర్ ఎన్నికయ్యారని తెలిపారు. కో-చైర్మన్లుగా రవి ప్రకాష్, విజయ్ కుమార్, నరసింహులు, విజయ్ కుమార్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా హేమలత, అశోక్, రామచంద్రారెడ్డి, రమాదేవి, సుధాకర్, మోహన్‌రెడ్డి, రెడ్డిపరెడ్డి, శేఖర్‌రెడ్డి, గిరివర్ధన్ నాయుడు, చిన్నప్ప, గాలి రవీంద్ర, విద్యాధరరావు, రవి నాయక్, మోహన్, నాగరాజ, ఆనందరెడ్డి, వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి,మధుసూదన మాట్లాడుతూ సుమారుగా 32 ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో నూతన కమిటీని ఏర్పాటు చేయడమైనదని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్, కార్మిక సమస్యలపై ప్రాతినిధ్యం చేస్తూ, సమస్యల సాధనకై నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. అవసరమైనప్పుడు పోరాటానికి సిద్ధమని పేర్కొన్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఉద్యోగులకు సంఘం అందుబాటులోఉంటుందని తెలిపారు. మదనపల్లి రాష్ట్రంలోనే ఉద్యమాలకు పుట్టినిల్లు లాంటిదన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారెడ్డి

కౌన్సిలర్లకు సూచనలు చేస్తున్న చమర్తి జగనమోహన్‌రాజు

మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసి నడుద్దాం

- టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపాలిటీ అభివృద్ధికి, రాజంపేట ప్రజలకు మంచి సదుపాయాలు కల్పించేందుకు కలిసి పని చేద్దాం అని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు మున్సిపల్ కౌన్సిలర్లకు సూచించారు. శనివారం రాజంపేట క్యాంప్ కార్యాలయంలో పలువురు కౌన్సిలర్లు చమర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట ప్రజల సౌకర్యార్థం, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి రాజంపేటను అభివృద్ధి పథంలో నడిపించాలంటే అందరం కలిసి నడవవలసిన పరిస్థితి ఉందని, ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపాలిటీ కూడా అన్ని విధాల అభివృద్ధి చేసుకోవాలంటే అది కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమని తెలిపారు. ఏ నాయకుడికైనా తమకు అవకాశం ఇచ్చిన ప్రజలకు న్యాయం చేసినప్పుడే భవిష్యత్తులో మనుగడ ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీని గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీరం చేసిందని, అభివృద్ధి పక్కదారి పట్టిందని విమర్శించారు. అభివృద్ధి చేసే ప్రభుత్వానికి అండగా నిలిస్తే రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధి చేసుకోవచ్చున్నారు. ప్రజలకు మంచి సేవలు అందిస్తే నాయకులుగా గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తాము కట్టుబడి ఉన్నామని, అందరం కలిసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-రాయచోటి

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తాగినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం జరుగుతుందని నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలం, మాధవరం వడ్డేపల్లెలో నీటి సమస్య పరిష్కారానికి ఆయన నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండల పరిధిలోని మాధవరం గ్రామం ,వడ్డేపల్లిలో నూతన బోరును ప్రారంభించి గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలో ఏ ఒక్కరు కూడా నీటి సమస్యతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో బోర్లు వేసి నీటి సమస్య పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి బోరును ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

మృగరాజుపై లోకాభిరాముడు

వైభవం కల్పవృక్ష వాహనం
ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకి క్షేత్రంలోని వెయ్యేళ్ల చరిత్ర కలిగిన శ్రీపట్టాభి రామస్వామి విశ్వావసు నామ సంవత్సర సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం స్వామివారు కల్పవృక్ష, సింహవాహనాలపై అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సర్వాలంకారశోభితులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని కల్పవృక్ష వాహనంపై అధిష్టించి తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. తదుపరి స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులకు ఉయ్యాల మండపంలో ఊంజల్ సేవ జరిగింది. రాత్రి 8 గంటలకు ఉత్సవమూర్తులకు సింహవాహనంపై మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మీ, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, సలహాదారులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, కృష్ణరాజుభట్టర్, సిబ్బంది నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

సింహవాహనంపై ఊరేగుతున్న రాఘవుడు

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు సర్వభూపాల వాహనం, 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 8 గంటలకు పెద్దశేష వాహన సేవ ఉంటుంది.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతీయ సెలవు దినాన్ని అమలు చేయడంలో జిల్లా విద్యా శాఖాధికారులు విఫలమయ్యారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ అన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సెలవు దినమైనటప్పటికీ పట్టణంలో అత్యధిక కార్పొరేట్, ప్రయివేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలలు తెరిచారని, వాటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, డిఇఒలకు ప్రసారం మాధ్యమం ద్వారా సమాచారం అందించామన్నారు. స్కూల్, కాలేజ్ విద్యార్థుల తరగతులను బాయికాట్ చేసి విద్యార్థులను పంపించి వేశామన్నారు. నిబంధనలు విరుద్ధంగా నడిపిన కార్పొరేట్ విద్యా సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్ప నిర్లక్ష్యం చేయడంతోనే స్వతంత్ర సమరయోధుల సెలవు దినాలు సైతం అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. విద్యార్థులు బాబు జగ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, సమీర్, ప్రేమ్, బన్నీ, పాల్గొన్నారు.

అరటి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులతోనియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ పేర్కొన్నారు. కోడూరు మండలం అనంతరరాజుపేట పంచాయతీ తుంగావాండ్లపల్లిలో పర్యటించారు. రైతులకు పంట నష్టం జరిగిందని రైతుల పొలాల్లోకి స్వయంగా వెళ్లి ధ్వంసమైన అరటి తోటలను పరిశీలించారు. రైతులు నష్ట పోయిన పంట నష్ట వివరాలు ఎమ్మెల్యే స్వయంగా ప్రజల,అధికారుల సమక్షంలో అడిగి తెలుసుకున్నారు. ఐదు మండలాల్లో అరటి తోటలను సందర్శించి పంట నష్టం వివరాలను ఆరా తీసి, నివేదిక అందించి,అరటి రైతులకు తగిన నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఆషియా, రైతులు, అధికారులు, నాయకులు వెంకట్రామరాజు జోగినేని మణి,పగడాల చంద్రశేఖర్, వెంకటేష్, సుకుమార్, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో చిత్రకారుడికి ప్రశంసలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గిరిధర్‌ను అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

రాజంపేట పట్టణం బోయపాలెంకు చెందిన ప్రముఖ చిత్రకారుడు నాయిని గిరిధర్ చిత్రలేఖన రంగంలో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ తేజస్విని ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో నిర్వహించిన హస్తకళ చిత్రలేఖన ప్రదర్శనలో సుమారు 500 మంది కళాకారులు పాల్గొనగా వారిలో నాయిని గిరిధర్ చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతులు మీదుగా ఘన సత్కారం పొంది ప్రశంసా పత్రం అందుకున్నారు. తమ ప్రాంతానికి చెందిన కళాకారుడు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం తమకు గర్వకారణమని రాజంపేట వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టాభిషేక మహోత్సవానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఈనెల 9న అంగరంగ వైభవంగా ఆరోవ బిషప్ సగినాల పాల్ ప్రకాష్ బిషప్ పట్టాభిషేక మహోత్సవానికి సర్వం సిద్ధం చేస్తు న్నామని మేత్రసన వికర్ జనరల్ తలారి బాలరాజు, కోశాధికారి సంబటూరు సురేష్ తెలిపారు. శనివారం మరియాపురం ప్రాంగణంలోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్ బిషప్ అరుళయ్య వేదికపై జరుగుతున్న పనులను వారు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి నాలుగు జిల్లాల మేత్రాసన కాపరిగా సగినాల పాల్ ప్రకాష్ బిషప్ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్ అందుకుంటున్న విద్యార్థులు

41 మంది 'మిట్స్' విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్‌లో ఎంసిఎ, ఎంబిఎ చదువుతున్న 41 మంది విద్యార్థులకు హెచ్‌డిఎఫ్‌సి (హెచ్‌డిఎఫ్‌సి) బ్యాంక్ పరివర్తన్ ఎడ్యుకేషనల్ క్రైసిస్ స్కాలర్‌షిప్ సపోర్ట్ (ఇసిఎస్‌ఎస్) స్కాలర్‌షిప్‌లు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. మెరిట్ కమ్-నీడ్ ఆధారిత స్కాలర్‌షిప్ పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను అభ్యసించే విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లు అందుకున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద ముగ్గురు ఎంబిఎ విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.75 వేలు స్కాలర్‌షిప్, 37 మంది ఎంసిఎ విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.35 వేలు, బి.టెక్ విద్యార్థికి రూ.50 వేలు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేశారని పేర్కొన్నారు. కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్ ప్రినిపల్ కమల్ బాషా స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సమీనా, మౌలాలి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

వడదెబ్బతో యువకుడి మృతి

నరసింహులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మాడుపగిలే ఎండలు ఓ విభిన్నప్రతిభావంతుడిని బలి తీసుకున్నాయి. పట్టణ పరిధిలోని డిబిఎన్ పల్లె దళతవాడకు చెందిన కూల్లూరు నరసింహులు(38) శనివారం వడదెబ్బతో గ్రామంలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. హుటాహుటిన ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా డీహైడ్రేషన్ కారణంగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు నరసింహులు కుటుంబంలో అతనితో పాటు నలుగురు చెవిటి, మూగ వైకల్యం కలిగిన వారు ఉన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల వారు స్పందించి వారి కుటుంబానికి చేయూతనివ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

జాతీయ స్థాయి పోటీల్లో 'అన్నమాచార్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య యూనివర్సిటీలో ఇఇఇ చివరి సంవత్సరం చదువుతున్న బి.అంకిత శ్రావణి, పి.చంద్రిక, ఎం.లహరి, ఎస్.ఫయాజ్ అహ్మద్ తిరుపతిలోని ఎన్.బి.కె.ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు నిర్వహించిన ఇన్‌స్పైరన్-2025 జాతీయస్థాయి సాంకేతిక సింపోజియన్‌లో ప్రాజెక్టు ఎక్స్పో విభాగంలో ప్రథమ బహుమతి సాధించినట్లు విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి జాతీయ స్థాయి పోటీలలో మరింత స్వరూపుగా పాల్గొని ప్రతిభ నిరూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఇ.సాయిబాబారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్టర్ ఎన్.మల్లిఖార్జునరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి.నారాయణ, ఇఇఇ భాగాధిపతి ఎం.పద్మ లలిత, తదితరులు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

విద్యార్థులకు విసితో కలసి మెడల్స్‌ను అందిస్తున్న ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు

క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలి : విసి

ప్రజాశక్తి-కలికిరి

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని అనంతపురం జెఎన్‌టియు విసి, ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. శుక్రవారం కలికిరి జెఎన్‌టియు కళాశాలలో జరిగిన వార్షికోత్సవ వేడు కలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విజయ ప్రయాణంలో నిబద్ధత, నిజాయితీ, స్పష్టమైన దృష్టి, ఉన్నతమైన ఆశయాలు కీలకమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. జెఎన్‌టియు క్యాంపస్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తీసుకెళ్లడంలో మీ భాగస్వామ్యం ఎంతో ముఖ్యం అన్నారు. విశ్వ విద్యాలయం మీకు అందిస్తున్న అత్యాధునిక సౌకర్యాలను బిటెక్ చదువుతున్న నాలుగేళ్ల కాలంలో పూర్తిగా ఉపయోగించుకోవాని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థులు మీ స్నేహితులకు మంచి ప్లేస్‌మెంట్‌లు సాధించి పెట్టేలా కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పడిన కష్టాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల అవసరాలకు, అధ్యాపకులకు ఏ అవసరం ఉన్నా విసి ఎల్లవేళలా అందుబాటులో ఉండడం మన అదృష్టంగా భావించాలన్నారు. స్వయం ప్రతిపత్తి హోదా సాధించిన ఈ రెండు సంవత్సరాల కాలంలో, న్యాక్-ఎ గుర్తింపు, స్వంత కోర్సు స్ట్రక్చర్, రిసల్ట్ ప్రాసెసింగ్ విభాగాల్లో పురోగతి సాధించామని అన్నారు. విద్యార్థులు ఫలితాలు కూడా సుమారు 70శాతం పైగా విద్యార్థులు 7 సిజిపిఎ కంటే ఎక్కువగా సాధిస్తున్నారని అన్నారు. ఈ సంవత్సరం సుమారు 25 విద్యార్థులు గేట్ ర్యాంకులు సాధించా ర న్నారు. 2020-24 బ్యాచ్ లో కళాశాల ఓవర్ ఆల్ టాపర్ గా నిలిచిన సి ఎస్ఇ విద్యార్థిని పద్మజను విసి అభినందిస్తూ గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. అనంతరం విభాగలవారిగా ఇద్దరు టాపర్ విదార్థులకు మెడల్స్, సర్టిఫికేట్ ప్రధానం చేశారు. మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో, విద్యార్థులు ఉర్రూతలూగించే పాటలతో అదిరిపోయే స్టెప్పులతో, స్కిట్స్ తో కళాశాలలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ త్యాగరాజన్, హెచ్ఒ డిలు, అధ్యాపకులు, నాన్ టీచింగ్, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మేఘనను అభినందిస్తున్న ప్రిస్సిపల్ ప్రసాద్

జాతీయ స్థాయి వుడ్‌బాల్ పోటీల్లో

ప్రతిభ చాటిన 'ఆదిత్య' విద్యార్థిని

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహారాష్ట్రలోని నాగపూర్‌లో మార్చి నెల చివరి మాసంలో నిర్వహించిన వుడ్ బాల్ జాతీయస్థాయి సీనియర్స్, జూనియర్స్ విభాగంలో బి.కొత్తకోట ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థిని సత్తా చాటింది. మొదటి సంవత్సరం బీకాం చదువుతున్న ఎన్.మేఘన విశేష ప్రతిభ కనబరిచి సింగిల్స్ విభాగంలో మొదటి స్థానం, జట్టు విభాగంలో రన్నరఫ్‌గా నిలిచిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ తెలిపారు. ఆల్ ఇండియా వుడ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగపూర్ నగరంలో జరిగిన వుడ్ బాల్ క్రీడా పోటీల్లో 28 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన టోర్నమెంట్లో తమ కళాశాల విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరచడం అద్భుతమని అన్నారు. ఆల్ ఇండియా వుడ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు అభిషిత్‌దేశ్‌ముఖ్ చేతుల మీదుగా షీల్డ్ అందుకున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, మేనేజర్ బి.రాజేంద్ర నాయక్ మరియు అధ్యాపకులు అభినందించారు.

బాధితుడికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మీ

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిట్వేలి

మండలంలోని సి.కందులవారిపల్లి పంచాయతీ వడ్డపల్లి గ్రామానికి చెందిన మల్లికా కార్తీక్ విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు కోల్పోయాడు. కుటుంబ జీవనానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ తరఫున కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ తన కొడుకు సాయివికాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రెండు చేతులు కోల్పోయి, పొట్ట కూటి కోసం ఇబ్బందులు పడుతున్న మల్లికా కార్తీక్ కుటుంబానికి భరోసానిచ్చిన ముక్కా కుటుంబాన్ని ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, బాధితుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు భావ్యం కాదు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని మిడుతూరులో టిడిపికి చెందిన నాయకులు వైసిపి వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ నిరాధారమైన ఆరోపణలు చేయడం భావ్యం కాదని, ఇవి తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చని టిడిపి నాయకులు ఇట్టేంశ్రీరాములు యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతియుతంగా ఉన్న గ్రామంలో కక్షలు, గొడవలు సృష్టించవద్దని సూచించారు. గత వైసిపి ప్రభుత్వంలో కుల్లాయమ్మ, జింకా అరుణ్‌కుమారు ప్రభుత్వ భూమిని పొందారన్నారు. వీరు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటున్నారని, వారికి ఏ మాత్రం అర్హత లేదన్నారు. టిడిపి నాయకులు ఎవరూ బెదిరింపులకు పాల్పడలేదన్నారు. అలాంటి అవసరం తనకు లేదన్నారు. టిడిపి శ్రేణుల ఎవరూ జోక్యం చేసుకోకుండా జింకా కుటుంబ సభ్యులే న్యాయస్థానానికి వెళ్లారని, న్యాయస్థానం సూచనల మేరకు రెవెన్యూ శాఖ అధికారులు విచారణ చేపట్టారని, ఆ మేరకే చర్యలు ఉంటాయన్నారు. టిడిపి శ్రేణులపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని పేర్కొన్నారు.

మధురైకి సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : మధురైలో జరుగనున్న సిపిఎం జాతీయ మహాసభలకు ఆ పార్టీ ప్రొద్దుటూరు నాయకులు శనివారం సాయంత్రం మధురై బయల్దేరారు. బస్సును సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం జాతీయ మహాసభలు తమిళనాడులోని మధురైలో ఈనెల 2న ప్రారంభమై 6న ఆదివారం ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాలకు ప్రొద్దుటూరు నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, బయల్దేరారని తెలిపారు.

బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం : జెసి

బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెసి ఆదర్శరాజేంద్రన్

బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం రాయచోటి కలెక్టరేట్లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జెసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సమతావాది, మానవతావాది, సుపరిపాలనాదక్షుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి మహోన్నతమైన సేవ చేశారన్నారు. 1908 ఏప్రిల్ 5న జన్మించిన డా. బాబు జగ్జీవన్ రామ్ చిన్నతనం నుంచి ధర్మ ప్రవర్తన, గురువుల ఎడల భక్తి భావాలు కలిగి ఉండేవారన్నారు. కేంద్ర కేబినెట్ మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా మూడు దశాబ్దాలకు పైగా దక్షతతో దేశానికి ఎంతో సేవ చేశారని చెప్పారు. బాబు జగ్జీవన్ రామ్ అణగారిన కులాల వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తి స్థాయిలో అందేవిధంగా జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తని వ్యక్తి అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 1971లో భారతదేశానికి మరియు పాకిస్తాన్ కి మధ్య జరిగిన యుద్ధ సమయంలో బాబు జగ్జీవన్ రామ్ రక్షణ శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు దేశ ప్రజలలో స్ఫూర్తిని నింపారన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన్ రావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి జయప్రకాశ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, వివిధ ఎస్‌సి సంఘాల నాయకులు పాల్గొన్నారు. **ఎస్‌పి ఘన నివాళి :** మహనీయుల ఆదర్శాలను పాటిస్తూ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశ స్వతం త్రం, సామాజిక సమానత్వం కోసం అలుపెరుగని పోరాటం చేసి ప్రజల మన సుల్లో చిరస్మరణీయుడయ్యాడని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అడ్మిన్ ఎం.వెంకటాద్రి, ఎఆర్‌ఐలు విజె రామకృష్ణ, ఎం.పెద్దయ్య, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శంకర మల్లయ్య, రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ మధు, రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.**టిడిపి ఆధ్వర్యంలో..**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూజగ్జీవన్‌రామ్ అని నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడు కలను టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకుంటూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రాజంపేట పార్లమెంట్ క్యాంపు కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో బాబూజగ్జీవన్ రామ్ జయంతి సంద ర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ మండలాధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు డిఆర్ఎల్ మణి, మైనారిటీ నాయకులు అబూబకర్, టి ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, పోలి శివకుమార్ పాల్గొన్నారు. **నందలూరు:** జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నందలూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, జిల్లా మాజీ మైనారిటీ కార్యదర్శి సయ్యద్ అమీర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ మౌలా, మెహర్, కుర్ర మణియాదవ్, గురుప్రసాద్, తుమ్మాది శివకుమార్, పోమ్మల శివ, నరసింహులు, నారాయణ పాల్గొన్నారు.**నిమ్మనపల్లి:** మండలంలోని పెద్దమాదిగపల్లి వద్ద బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రెడ్డినారాయణ, రెడ్డిప్రసాద్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్,ఎంఎస్‌పి, ఎంఇ ఎఫ్ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మల్లేశ్వరరావు, హరిబాబు, శేషు, రెడ్డప్ప, రాజశేఖర్, భాను శశిధర్, రాజేష్, శ్రీనివాసుని, చరణ్, మనీ, బాలాజీ, హేమంత్ పాల్గొన్నారు. **రామాపురం :** మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామాంజ నేయులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్ర మంలో డిప్యూటీ తహశీల్దార్ కృపావతి, ఆర్ఐ సమన్‌ఖాన్, విఆర్ఒలు, కార్యాలయం సిబ్బందిపాల్గొన్నారు **మదనపల్లె :** స్థానిక బేబి వెల్కమ్ హోమ్‌లో జగజ్జీవన్ రామ్ 118 వ జయంతి ని పురస్క రించుకొని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొని యాడారు. కార్యక్రమంలో బిసి ఐక్య వేదిక నాయకులు రాజేంద్రనాయుడు, నరసింహులు, ఎం.సుబ్రమణ్యం, కట్టా గంగలప్ప, మౌలాలి, క్రిష్ణమూర్తి, చెన్నం శ్రీరాములు బిసి ఐక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.**టిడిపి కార్యాలయంలో:** ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాల మేరకు బెంగళూరు బస్టాండ్ టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళిఅర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి రాటకొండ మధుబాబు పాల్గొన్నారు.**తంబళ్లపల్లి :**భారతావనిలోని అందరికీ ఆదర్శవంతుడిగా జగ్జీవన్‌రామ్ నిలిచారని ఎంఆర్‌పిఎస్ నాయకులు మల్లికార్జున, బోర్డు సంస్థ ప్రతినిధి నరసింహులు అన్నారు. హరిత సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని దేశంలో సమ సమాజ స్థాపనకు అట్టడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పేదల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా భారతదేశానికి ఆయన చేసిన సేవలు అజరామరం అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ఎదురు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘం నాయకులు రఘుపతి, గోపి దీన్నే మల్లికార్జున పాల్గొన్నారు.

బోద్ గయ మహావిహారం బౌద్ధులకే అప్పగించాలి

మదనపల్లె: మహాబోధి మహావిహారం అని పిలువబడే, బోద్ గయ ఆలయాన్ని పూర్తి స్థాయిలో బౌద్ధులకే అప్పగించాలని, ఇక్కడ ప్రస్తుతం కొనసాగుతున్న బోద్ గయ ఆలయ నిర్వహణ కమిటీని వెంటనే రద్దు చేయాలని, భారతీయ అంబేద్కర్‌సేన(బాస్) వ్యవ స్థాపకుడు పిటిఎం శివప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని న్యూ అంబేద్కర్ సర్కిల్ వద్ద భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వ ర్యంలో సామ్రాట్ అశోక, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ హెడ్ కానిస్టేబుల్ డి.జి. రామ్మూర్తి, బాస్ రాష్ట్ర అధికార ముత్యాల మోహన్, కోశాధికారి నీరుగట్టి రమణ, బాస్ ఉద్యోగ విభాగం నాయకులు డాక్టర్ గంగాద్రి, అంజనప్ప పాల్గొన్నారు.

మదనపల్లె: మాట్లాడుతున్న ప్రసాద్

చినుకు పడితే చిత్తడే..!

- బురదమయమైన బస్టాండ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-గాలివీడు

చినుకు పడితే చాలు ఆర్‌టిసి బస్టాండ్ బురదమయమై పోతోంది. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ ఆవరణమంతా బురదమయమై పోతుండంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు ఎక్కేటప్పడు, దిగే టప్పుడు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. నియోజకవర్గానికి ప్రాతి నిథ్యం వహిస్తున్న రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఉండ డంతో మండల ప్రజలకు ఆశ ఐదు సంవత్సరాలలోపు ఆర్‌టిసి బస్టాండ్ అభి వృద్ధిలోకి ముందుకు పోతుం దని ఆశతో ఎదురు చూస్తున్నారు. గాలివీడు ఆర్‌టిసి బస్టాండ్ నుంచి ప్రతి సంవ త్సరానికి రూ.2లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. బస్టాండ్‌కు సరైన సదుపాయాలు కల్పించడంలో ఆర్‌టిసి అధికారులు చొరచూపడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బురదమయంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత టిడిపి నాయకులు, కార్య కర్తలదేనని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగిరిపల్లిలోని ఆయన స్వగృహంలో టిడిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ పథకాలే ప్రధాన కారణమని అన్నారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన పింఛన్లు, ఉచిత సిలిండర్లు, రాబోవు రోజుల్లో రైతులకు రూ.20వేలు నగదు, విద్యా కానుక వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కొత్తగా నామినేటెడ్ పద వులకు ఎంపికైన ఎఎంసి చైర్మన్, డైరెక్టర్లను శాలువాతో సన్మానించి వారికి అభినం దనలు తెలిపారు. చైర్మన్, డైరెక్టర్లుగా ఎంపికైన ప్రతి ఒక్కరూ రైతు అభివృద్ధికి కృషి చేయా లని కోరారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గంలోని కలికిరి, వాల్మీపురం, గుర్రంకొండ, కలకడ, పీలేరు, కె.విపల్లి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఎంసి చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

అధునాతన సాంకేతిక విద్యకు శ్రీకారం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నూతన పద్ధతిని అమలు చేస్తున్నామని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. స్థానిక బాలాజీ హైస్కూల్‌లో శనివారం కరస్పాండెంట్ బైరెడ్డి దీప్తి నిఖిలారెడ్డి అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేకుండా, శారీరక శ్రమను తగ్గించేందుకు తాము ప్రవేశపెట్టబోయే కరికులం ఉపయోగ పడుతుందన్నారు. లీడ్ ఇంటిగ్రేటెడ్ కోర్సు ద్వారా జమ్మలమడుగులో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల నైపుణ్యంతో పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను మరింత బయటికి తీయుటకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. సంపూర్ణ అభ్యసన పద్ధతుల వల్ల విద్యార్థులు అర్థం చేసుకొని భవిష్యత్‌లో మర్చిపోకుండా ఉంటారన్నారు. లీడ్ ప్రోగ్రామర్ నిశాంత్ తల్లిదండ్రులకు అర్థమయ్యేలా చెప్పారు. విద్యార్థి ఒకటిన్నర విద్యా సంవత్సరంలో ఎంత జ్ఞానాన్ని పొందుతారో అంత జ్ఞానాన్ని ఒక ఏడాదిలోనే పొందుతారని తెలిపారు. ఎఒ ప్రసాద్‌రెడ్డి, ప్రదానోపాధ్యాయురాలు సూర్యమిత్ర, ప్రిన్సిపల్ శిరీష, భరత్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసీం, ప్రసాద్, హృషి, సంపూర్ణ, నాగవేణి, పాల్గొన్నారు.

ఆధార్ సేవలకు బ్రేక్

ముద్దనూరు : పలు రకాల సేవలకు వినియోగించుకునేందుకు అవసరమైన ఆధార్ కార్డు పొందేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో రెండు చోట్ల ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. ముద్దనూరు, కొర్రపాడులో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఆధార్ సేవలు అందించే డిజిటల్ అసిస్టెంట్లు అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. వారం రోజుల వరకు ఆధార్ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. దీనిపై ఎంపిడిఒ ముకుందారెడ్డిని వివరణ కోరగా..ఆధార్ సేవలకు అంతరాయం లేకుండా సేవలు కొనసాగిస్తామన్నారు. పెనికలపాడు-2 డిజిటల్ అసిస్టెంట్‌కు ముద్దనూరు సచివాలయం-2కు ఆధార్ సేవలు చేసేందుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కొర్రపాడు సచివాలయం ఆధార్ కేంద్రాన్ని యామవరం సచివాలయానికి మార్చనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

నియామక పత్రాన్ని అందుకుంటున్న రఘురామయ్య

అధ్యాపక సంఘం అధ్యక్షుడిగా రఘురామయ్య

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా వీరబల్లి జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న జి. రఘురామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం రాయచోటి బాలుర ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జిల్లా అధ్యాపకుల సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధ్యాపకులు అందరూ కలిసి రఘురామయ్య ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సెక్రటరీగా బాలమురళి, వైస్ ప్రెసిడెంట్ గా శ్యాంసుందర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ చంద్రమోహన్, ట్రెజరర్‌గా సుధాకర్ రాజా, స్టేట్ కౌన్సిలర్‌గా వెంకటరమణ, మహిళా సెక్రటరీగా అల్తాఫ్ భాను, అడ్వైజర్‌గా అరుణమ్మను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రఘురామయ్య మాట్లాడుతూ జిల్లాలోని అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానని, కళాశాలలో నెలకొన్న సమస్యలును రాష్ట్ర కార్యవర్గం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానని తెలిపారు.

నిస్సార్ అహ్మద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మల్లికార్జునరెడ్డి

వైసిపి బలోపేతానికి కృషి : నిస్సార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైసిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, కార్యకర్తలకు తమ సహకారం తప్పక అందిస్తామని వైసిపి మదనపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. వైసీపి మండల నూతన కమిటీ సభ్యులు శనివారం పార్టీ కార్యాలయంలో నిస్సార్ అహ్మద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుబంధ కమిటీలు బలంగా పని చేస్తేనే పార్టీ మరింత పటిష్ఠం అవుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే దృష్టి సారించా లని సూచించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకుని వెళ్ళడంలో సమర్థవంతంగా పని చేయాలని తెలిపారు. తమపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

బ్రాహ్మణ సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమంపై దృష్టి సారించి లబ్ధి కలిగేలా చూడాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు సూగురు రఘునాథ్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రసాదరావు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. బ్రాహ్మణ సంక్షేమం కోసం గతంలో సిఎం చంద్రబాబు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. తద్వారా 2014-19 మధ్య వివిధ పథకాల ద్వారా బ్రాహ్మణులు లబ్ధి పొందారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.345 కోట్లు కేటాయించడంతో బ్రాహ్మణులకు మంచి రోజులు వచ్చాయని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను వేరు చేసి వివిధ పథకాలు రూపొందించాలని కోరారు. పార్టీ, పభుత్వ పదవుల్లో అవకాశం కల్పించాలని వారు సూచించారు.

క్రైం కార్నర్

దొంగల అరెస్టు చూపుతున్న పోలీసులు

అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

షటర్లు కట్ చేసి చోరీలకు పాల్పడే అంతర్ జిల్లా దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు సంబంధించి డిఎస్‌పి కొండయ్యా నాయుడు, క్రైమ్ బ్రాంచ్ సిఐ చంద్రశేఖర్, రూరల్ సర్కిల్ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ దిలీప్ కుమార్ శనివారం మీడియాకు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా, గుండ్లూరు మండలం, చనగొండ్లకు చెందిన గుజిరి వ్యాపారి మాదిగ జార్జ్, అన్నమయ్య జిల్లా, సుండుపల్లె మండలం, భైరవ గుట్టకు చెందిన బండపల్లి రెడ్డిశేఖర్ కురబలకోట మండలం, ముదివేడు సమీపంలోని కడప క్రాసులో షట్టర్ కట్ చేసి అర్ధరాత్రి వేళ చోరీలకు పాల్పడుతున్నట్లు పక్కా సమాచారం అందిందన్నారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ సిబ్బందితో వెళ్లి ఇద్దరు నిందితులు షట్టర్లు కట్ చేసి చోరీ చేస్తుండగా పట్టుకుని విచారించడంతో దొంగల గుట్టు రట్టయిందని చెప్పారు. పట్టుబడిన నిందితుల వద్ద నుంచి రూ. 4 లక్షల విలువైన ఆటో, ద్విచక్ర వాహనం, లాప్‌టాప్‌లు, ఫ్యాన్, సెల్‌ఫోన్లు, టివిలను సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లెలో జరిగింది. బాధితుని కథనం మేరకు.. పట్టణంలోని చంద్రాకాలనీ కి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గంగాద్రి పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. మార్గమధ్యంలోని నీరుగట్టుపల్లె రింగురోడ్డు స్పీడు బ్రేకర్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి సైడు ఇవ్వబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్ప త్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో ఆటో డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం పుంగనూరులో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు..పట్టణంలోని అనంతపాలెంకు చెందిన రామప్ప కుమారుడు సుబ్రమణ్యం ఆటో నడుపుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఇంటి ఖర్చులకు కూడా ఇవ్వకుండా మద్యానికే ఖర్చు పెట్టి తాగి ఇంటికి వస్తున్నాడు. ఈ విషయమై భార్య శోభ భర్తను రాత్రి నిలదీయడంతో ఇద్దరు ఘర్షణ పడ్డారు. మనస్తాపానికి గురైన సుబ్రహ్మణ్యం శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో తరలించారు. పుంగనూరు పోలీసులు విచారణ చేపట్టారు.